క్లుప్తంగా

కొవ్వూరులో లోవోల్టేజీ పరిష్కారం



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన విద్యుత్ సిబ్బంది

రోలుగుంట: కొవ్వూరు సాయి బాబు గుడి వీధిలో లోవోల్టేజీ సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. ఇక్కడ సమస్యను ఆశాఖ సిబ్బందికి చెప్పినా పట్టించుకోకపోవడంతో స్థానికులు ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావుకు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన రోలుగుంట విద్యుత్ శాఖ ఏఈ పద్మనాభంకు విన్నవించారు. దాంతో ఏఈ స్పందించి సిబ్బందిని ఆ ప్రాంతానికి పంపించారు. వెంటనే శుక్రవారం ఇక్కడ విద్యుత్ స్తంభానికి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు. ఎంపీపీతోపాటు ఏఈకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీ

నర్సీపట్నం: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మొదటి విడత మిగులు సీట్లకు ఈ నెల 18న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి తెలిపారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో ఒకటి నుంచి 881 ర్యాంకు వరకు సీటు రాని అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు



అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధి లాస్యశ్రీ

మాడుగుల రూరల్: బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటాయని విశాఖపట్నం కీన్ ఫౌండేషన్ ప్రతినిధి లాస్యశ్రీ తెలిపారు. శుక్రవారం కె.జె.పురం అంగన్‌వాడీ కేంద్రం-1లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల తలెత్తే ఆరోగ్య సంబంధిత వ్యాధులు గురించి వివరించారు. కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.వి.ఎస్.ఎస్ ప్రసాదుపాత్రుడు మాట్లాడుతూ మహిళలకు 18 ఏళ్లు దాటిన తర్వాత, పురుషులకు 21 ఏళ్లు దాటిన తర్వాత వివాహం చేయాలన్నారు. ఏఎన్‌ఎంలు శ్రావణిలక్ష్మి, అచ్యుతాంబ, అంగన్‌వాడీ కార్యకర్త చంద్ర, మహిళా పోలీసు సంధ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాతవరం తహసీల్దార్‌గా శ్రీనివాస్‌నాయుడు



శ్రీనివాస్ నాయుడు

నాతవరం: స్థానిక తహసీల్దార్‌గా ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు(వాసు) శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు ఇక్కడ పని చేసిన తహసీల్దార్ పి.కనకారావు ఇటీవల బదిలీల్లో భాగంగా పరవాడ మండలం తహసీల్దార్‌గా వెళ్లారు. ఈయన స్థానంలో మాడుగుల ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న శ్రీనివాస్‌నాయుడు పదోన్నతిపై నాతవరం వచ్చారు. ఆయన నర్సీపట్నం ఆర్డీవో హనుమంత వెంకట జయరామ్‌కు జాయినింగ్ రిపోర్టు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న భూ రీసర్వేను నిబంధనల ప్రకారం సకాలంలో పూర్తి చేసేందుకు దృష్టి సారిస్తానన్నారు. రైతుల సమస్యలతోపాటు సంక్షేమ, అభివృద్ధి పనులపై ఎప్పటికప్పుడు చర్చిస్తానన్నారు.

ఘనంగా ముగిసిన ఆలయ వార్షికోత్సవం



మహా క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

రావికమతం: కొత్తకోట దుర్గాదేవి ఆలయ 13వ వార్షికోత్సవం శుక్రవారంతో ఘనంగా ముగిసింది. ఈ నెల 15న అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు, మహా చండీ యాగం నిర్వహించగా, 16న 108 లీటర్లతో అమ్మవారికి మహా క్షీరాభిషేకం, పంచామృత అభిషేకాలు చేశారు. అనంతరం వివిధ రకాల పూలతో అలంకరించారు. ఈ నెల 18న ఆలయం వద్ద మహా శాంతి అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రధానార్చకుడు వేపా రామకృష్ణ కిషోర్ తెలిపారు.

సంక్షేమ పథకాలే ప్రభుత్వానికి శ్రీరామరక్ష

- మండుటెండలో గడప గడపకు తిరిగిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



మండుటెండలో ప్రజలతో ముచ్చటిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



జి. అగ్రహారంలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల రూరల్: సామాన్యులు సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలే తమ ప్రభుత్వానికి శ్రీరామరక్ష అని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జి. అగ్రహారంలో శుక్రవారం ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజల సంక్షేమం గురించి ఆరా తీశారు. మండుటెండను సైతం లెక్క చెయ్యకుండా 1,050 గృహాలను సందర్శించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సొంత స్థలం ఉన్న వారికి ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో ప్రాధాన్యత పనులు నిమిత్తం రూ. 20 లక్షల, కమ్యూనిటీ హాలు, ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. జెడ్పీ హైస్కూలులో నాడు -నేడు నిధులతో చేపట్టిన పనులను ప్రారంభించారు. జలజీవన్ మిషన్ నుంచి రూ.70 లక్షలతో 30 వేల లీటర్లు నీటి సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు నిర్మించి 400 కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. జగనన్న కాలనీలో నిర్మాణం పూర్తి చేసుకున్న 15 ఇళ్లకు ఉచితంగా కరెంటు మీటర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం రెండు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. చిన్నారులకు తినుబండారాలు అందజేశారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అనంతరం రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. కుమారులున్నా సరే అందరికి పెద్ద కొడుకు జగన్‌బాబు అని వృద్ధురాలు నంబారు కొండమ్మ పేర్కొంది. సంక్షేమ పథకాల వల్ల తమ లాంటి వారికి ఢోకా లేదన్నారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ (పెదబాబు), వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, సర్పంచ్ సందారపు మంగమ్మ, పానాపతి, ఎంపీటీసీ సభ్యురాలు ఆర్లె మాధవి, నాయుడు, ఉప సర్పంచ్ మాడ్సి దేముళ్లు, మాజీ సర్పంచ్‌లు సందారపు అప్పల సత్యనారాయణ, మాడ్సి వెంకటలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, పార్టీ నాయకులు కోట్ని శ్రీరామూర్తి, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, విస్సారాపు రామారావు, బొడ్డాపు భాస్కరరావు, కోరుకొండ చెల్లంనాయుడు, తాళ్లపురెడ్డి రాంబాబు, సయ్యపురెడ్డి నారాయణరావు, మాడుగుల, కె.జె.పురం సర్పంచ్‌లు యడ్ల కళావతి, జామి రమణబాబు పాల్గొన్నారు.

భూసర్వేతో రైతులకు ఎంతో మేలు

చౌడువాడ గ్రామసభలో తహసీల్దార్ రమేష్‌బాబు



చౌడువాడ గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌బాబు

కె.కోటపాడు: పారదర్శకంగా నిర్వహించే జగనన్న శాశ్వత భూహక్కు-భూసర్వే కార్యక్రమానికి రైతులంతా సహకరించాలని తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం చౌడువాడ గ్రామసభలో భూ సర్వే కార్యక్రమంపై రైతులతో ఆయన మాట్లాడారు. ఈ నెల 19 నుంచి గ్రామంలో సర్వే బృందాలతో 2,094 ఎకరాలు సర్వే చేయనున్నామన్నారు. సర్వే బృందాలకు రైతులు వారి భూములను చూపించడంతో పాటు ఆధార్, పాస్‌పోర్టు ఫొటో, భూమి పాస్ బుక్ జెరాక్స్, బ్యాంక్ ఖాతాల నంబర్లు ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం భూసర్వేతో భావితరాలకు ఎటువంటి రెవెన్యూ సంబంధిత ఇబ్బందులు ఉండబోవని తెలిపారు. రైతులు ప్రతీ మడికి ఒక్కో కంప్యూటర్ పటాన్ని అందించనున్నట్లు తెలిపారు. రీసర్వేలో సమస్యలపై గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారులకు లిఖిత పూర్వకంగా అర్జీ అందించి పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కన్వీనర్ దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఆకుల సాయి ప్రసాద్, చల్లా సురేష్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చి ప్రజల్లోకి వస్తున్నాం

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్



వెంకటరాంపురంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నవరత్నాల ద్వారా నూరుశాతం పథకాలు అందిస్తున్నామని, అందుకే ప్రజల్లోకి ధైర్యంగా వచ్చి వాటి లబ్ధి గురించి వివరిస్తున్నామని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. శుక్రవారం పాకలపాడు పంచాయతీ శివారు వెంకటరాంపురం, దిబ్బలపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రామాలయం వద్ద ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ప్రతీ గడపకు వెళ్లి ఇప్పటి వరకు అందించిన సంక్షేమ లబ్ధి గురించి ప్రజలకు వివరించారు. దిబ్బలపాలెంలో సీసీరోడ్డు కావాలని గ్రామస్తులు ఆయన్ను కోరారు. వెంటనే మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం వెంకటరాంపులో ప్రజల సమస్యను అడిగి తెలుసుకున్నారు. పక్కా గృహాలు మంజూరు చేయాలని పలువురు కోరారు. వెంటనే అర్హులైన వారికి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు నవరత్నాల ద్వారా పథకాలు అందిస్తామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారని, ఆ మాట ప్రకారం వలంటీర్లు, గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు నూరుశాతం పథకాలు అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఏ రాష్ట్రంలో చేయలేని మంచి పనులు ఇక్కడ చేస్తూ దేశంలో ఉత్తమ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపు పొందారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, మండల సచివాలయం కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు పాణీశాంతారామ్, సర్పంచ్ రాజాన పద్మ, ఎంపీటీసీ యాళ్ల లక్ష్మీదుర్గా నాయుడు, ఏఎంసీ చైర్మన్ సత్యన్నారాయణ, చోద్యం సహకార బ్యాంక్ చైర్మన్ పెద్దిరాజుతోపాటు స్థానిక నాయకులు రాజాన అప్పలనాయుడు, యాళ్లనాయుడు, అల్లు రమేష్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి.. దత్తతకు పరమార్థం



అంకుపాలెంలో వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

చోడవరం రూరల్: గ్రామాన్ని దత్తత తీసుకోవడం అంటే అభివృద్ధి చేయడం మాత్రమే కాదని, ఆ గ్రామ ప్రజలను సామాజికంగా, ఆరోగ్య పరంగా, విద్యాపరంగా, పారిశుధ్యం-పచ్చదనాన్ని అభివృద్ధి చేయడమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు తెలిపారు. శుక్రవారం స్థానిక కళాశాలలోని ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల విద్యార్థులు దత్తత గ్రామం అంకుపాలెంను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రామంలో పర్యటించి అక్కడి ప్రజల జీవన స్థితిగతులను మెరుగు పరచడానికి తమ వంతు పాటుపడాలన్నారు. కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య, మెరుగైన ఆరోగ్యం ద్వారా మానవాళికి మేలు చేకూరుతుందన్నారు. మనుషులకు ఇతర జీవులకు ఉన్న తేడా తెలిసి వచ్చే రీతిలో విద్యార్థులు మసులుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, ఎన్.ఎస్.ఎస్ పీవోలు బి.లక్ష్మి, బి.పిచ్చమ్మ, డి.మాల్యాద్రి, ఉపన్యాసకులు లక్ష్మిమంగమ్మ, రావి రాణి, ఎస్.మల్లిబాబు, బి.వెంకటేష్ పాల్గొన్నారు.

58 మందికి ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష చేయించుకుంటున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి

దేవరాపల్లి: స్థానిక ద్రోణంరాజు కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖపట్నం హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌సీజీ ఆస్పత్రి అంకాలజిస్టు ఇందిర 58 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ సబ్బువరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, వార్డు మెంబర్లు దీవి శంకర్, కొల్లి ఈశ్వరరావు, దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.లలిత, సూపర్‌వైజర్ మహేష్, ఎంఎల్‌హెచ్‌పీ రాణి, సంధ్య, ఏఎన్‌ఎంలు జి. పుష్ప, ఎస్. జయసుధ, డి. హైమా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

19, 20 తేదీల్లో స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలు

కె.కోటపాడు: కడప వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరంలో సీట్లు భర్తీకి విద్యార్థుల ఎంపిక పోటీలు మండల స్థాయిలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.శచీదేవి తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో ప్రవేశానికి 40 సీట్లు, 5వ తరగతిలో 11 సీట్లు భర్తీకి ఈ ఎంపిక ప్రక్రియ స్థానిక హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్లు పర్యవేక్షణలో ఉంటుందన్నారు. ఈ నెల 19న బాలురకు, 20న బాలికలకు చేపట్టే ఎంపిక పోటీలకు హాజరు కావాలని సూచించారు.

గౌరీపరమేశ్వరుల 181వ ఊంజల్ సేవ

అనకాపల్లిటౌన్ : గవరపాలెం శ్రీగౌరీపంచాయతన దేవస్థానంలో గౌరీపరమేశ్వరుల 181వ ఊంజల్‌సేవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయి, వేదపండితులచే నిర్వహించారు. పెంటకోట బాలకృష్ణ, శకుంతల, కుమారుడు సంతోష్, రామలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఉంజల్‌సేవ జరిగింది. దేవ స్థానం అధ్యక్షుడు సన్యాసినాయుడు, కార్యదర్శి రమణాజీ, కోశాధికారి శివసూర్యనారాయణ పాల్గొన్నారు.

విత్తనాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

మాకవరపాలెం: వరి విత్తనాలు కావాల్సిన రైతులు తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏవో చిరంజీవి శుక్రవారం తెలిపారు. మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తమ ఆధార్ కార్డు తీసుకెళ్లి ఏ విత్తనాలు కావాలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. లేకుంటే విత్తనాలు పంపిణీ చేసే అవకాశం లేదన్నారు. రైతులు ముందుగా విత్తనాల రకం నమోదు చేసుకోవడంతోపాటు నగదు చెల్లించాల్సి ఉందన్నారు.

స్పందన ఫిర్యాదుపై విచారణ

మాకవరపాలెం: అనర్హులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారంటూ స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. తామరంలోని సర్వే నంబర్ 70/1లో ప్రభుత్వ భూమిలో 98 మందికి ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయి. వీటిలో అనర్హులకు స్థలాలు ఇచ్చారని పి.పి.అగ్రహారం గ్రామానికి చెందిన బొంతు రమణ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడని తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టామన్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఆర్బీకేలతో తీరిన రైతన్న విత్తన కష్టాలు




రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ సత్య వెంకటరమణ

దేవరాపల్లి: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా ఖరీఫ్ విత్తనాలు సరఫరా చేయడంతో అన్నదాతలకు కష్టాలు తీరాయని సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ తెలిపారు. ఏ. కొత్తపల్లిలో రైతులకు ఖరీఫ్ వరి విత్తనాలను వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మితో కలిసి ఆయన శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పండూరి సరువునాయుడు, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

20న చలో విజయవాడ

నర్సీపట్నం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని ఈ నెల 20న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఎల్.వి.రమణ పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చలో విజయవాడ కరపత్రాలను విడుదల చేశారు. దీర్ఘకాలికంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. సంక్షేమ బోర్డులో పెండింగ్ క్లెయిమ్‌లు వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రమణ, గణేష్, నర్సింగరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

నర్సీపట్నం తహసీల్దార్‌గా అన్నాజీరావు



తహసీల్దార్ అన్నాజీరావు

నర్సీపట్నం: స్థానిక ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అన్నాజీరావును నియమిస్తూ కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అన్నాజీరావు డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

రథోత్సవంలో బందోబస్తుకు వినతి



సీఐ దాడి మోహన్‌కు వినతిపత్రం అందిస్తున్న పీలా రాంబాబు

అనకాపల్లిటౌన్ : జగన్నాథస్వామి రథయాత్రలో పోలీస్‌బందోబస్తును ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ 81వ వార్డు ఇన్‌చార్జి పీలా రాంబాబు కోరారు. ఈ మేరకు పట్టణ సీఐ దాడి మోహన్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ నెల 20న జరిగే రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బలగాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో దాడి ఈశ్వరరావు, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, కోదండపాణి, పలకా కాసులు, మళ్ల రామచంద్రరావు, కొణతాల పరదేశినాయుడు, పొలిమేర ఓంకార్ పాల్గొన్నారు.

6 నెలల్లో గొన్నవానిపాలేనికి తారురోడ్డు

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ హామీ



గొన్నవానిపాలెంలో రోడ్డు ఏర్పాటు చేసే ప్రదేశాన్ని గ్రామస్తులతో పరిశీలిస్తున్న విప్ ధర్మశ్రీ



పి.భీమవరంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పి.భీమవరం శివారు గొన్నవానిపాలెం, శ్రీరాంపురం గ్రామాల్లో శుక్రవారం ఆయన ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో సీఎం జగనన్న పాలన బాగుందని, మరలా వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే వస్తోందని మూడు గ్రామాల ప్రజలు విప్ ధర్మశ్రీ ఎదుట ఆనందంగా తమ మనోభావాలు వ్యక్తం చేశారు. గత టీడీపీ హయాంలో గొన్నవానిపాలెంకు తారు రోడ్డు వేస్తామని టీడీపీ నాయకులు పలుమార్లు చెప్పిన రోడ్డు ఏర్పాటు చేయలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇక్కడ జంక్షన్ నుంచి గ్రామంలోకి గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేశారన్నారు. గ్రావెల్ రోడ్డును తారురోడ్డుగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. పొలాల్లో నుంచి గ్రామంలోకి వస్తున్న విద్యుత్ లైన్ సక్రమంగా లేక ఏ మాత్రం గాలివర్షం వచ్చిన సరఫరా నిలిచిపోయి చీకట్లో మగ్గుతున్నామని, గ్రామానికి దగ్గరగా కేబీ రోడ్డు నుంచి కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ సమస్యలపై విప్ స్పందించి ఆర్నెల్లలో గ్రామానికి తారు రోడ్డు నిర్మిస్తామని, విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. శ్రీరాంపురం గ్రామస్తులు వినతి మేరకు కమ్యూనిటీ హాలు మంజూరు చేశారు. పి భీమవరంలో ఎస్సీ కాలనీకి ఇరుపక్కల కొంతమంది గ్రామ కంఠం స్థలాన్ని ఆక్రమించారని సర్వే చేసి హద్దులు చూపాలని కాలనీ వాసులు కోరారు. ఈ సమస్య పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను విప్ ఆదేశించారు. పి భీమవరంలో కమ్యూనిటీ హాలుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీలు దొండా నారాయణమూర్తి, గొంపా చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, సర్పంచ్ పినపోలు రామునాయుడు, నాయకులు బోయిన నారాయణమూర్తి, మోటూరి చిన్నంనాయుడు, గోపిశెట్టి శ్రీను, గుడాల ఆనంద్, గుడ్డేటి శ్రీను పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ



కొత్తపెంటలో కిట్లను అందజేస్తున్న సర్పంచ్ వెంకటరావు



విద్యార్థులకు కిట్లు అందిస్తున్న కోటేశ్వరరావు, తదితరులు

దేవరాపల్లి: జగనన్న విద్యా కానుక కిట్లు పేద విద్యార్థుల పాలిట వరంగా మారాయని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ బూరె బాబూరావు తెలిపారు. బోయిలకింతాడ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఆయన ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వరరావుతో కలిసి విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. స్థానిక ఉపాధ్యాయులు సత్యనారాయణ, పరమేష్, గ్రామ పెద్ద కోన సత్యం పాల్గొన్నారు. కొత్తపెంట ఎంపీపీ పాఠశాలలో సర్పంచ్ రొంగలి వెంకటరావు విద్యార్థులకు జగనన్న విద్యా కనుక కిట్లు పంపిణీ చేశారు. సీఎం జగన్ విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు.

కె.కోటపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు సాగిస్తున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యమిస్తున్నారని రొంగలినాయుడుపాలెం గ్రామ సచివాలయ కన్వీనర్ పైల కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఆయన జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం రోజు నుంచే వీటిని అందించడంతో విద్యార్థుల చదువుకు ఆటంకం ఉండదన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు ఆర్.సూరిబాబు, మాజీ సర్పంచ్ రొంగలి సత్యనారాయణ, పైల సత్యనారాయణ, బోజంకి ప్రకాశరావు, జూరెడ్డి అప్పారావు, బాబ్జి, నాయుడు పాల్గొన్నారు.

రోలుగుంట తహసీల్దార్‌గా వరహాలు



తహసీల్దార్ వరహాలుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

రోలుగుంట: స్థానిక తహసీల్దార్‌గా కె.వరహాలు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయనకు ఆర్ఐ రామ్మూర్తి, వీఆర్వో నానాజీ, టైపిస్ట్ చక్రపాణి, జూనియర్ అసిస్టెంట్ లలిత పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ మాట్లాడుతూ ప్రథమంగా రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వే కార్యక్రమానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. తాజాగా సురక్ష కార్యక్రమం అమలు ద్వారా ప్రతి సచివాలయంలోను పది రకాల ధ్రువపత్రాల కోసం ప్రజల దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించాల్సి ఉందన్నారు. ఇది కచ్చిత పద్ధతిలో అమలయ్యేలా చర్యలు తీసుకోనున్నట్టు వివరించారు. తహసీల్దార్ ప్రమోషన్ జాబితాలో ఉన్న తనను ఇక్కడికి డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ చేసిన రెండు రోజుల్లోనే మరలా ఇక్కడికే నూతన పోస్టింగ్ నియామక పత్రాలు జారీ చేయడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ఉన్నతాధికారుల సూచనలు, దిగువ స్థాయి సిబ్బంది సహకారం తీసుకుని అన్ని వర్గాల వారికి మెరుగైన సేవలందించి తమ శాఖకు మంచి పేరు తీసుకొస్తానన్నారు.

ఠారెత్తిస్తున్న ఎండలు... జనాల బెంబేలు



నిర్మానుష్యంగా నర్సీపట్నం- వడ్డాది ఆర్ అండ్ బీ రోడ్డు

రోలుగుంట: నాలుగు రోజులుగా కాస్తున్న ఎండలకు జనాలు బెంబేలెత్తుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉష్ణోగ్రత తీవ్రత ఒకే మాదిరిగా ఉండటంతో ప్రయాణికులు ప్రయాణాలు చేయలేని పరిస్థితి ఉంది. వడగాల్పులు, దీనికి తోడు ఉక్కపోత తోడై ఇళ్లలో సైతం ఫ్యాన్లు, కూలర్ల వినియోగంతో ప్రజలు గడుపుతున్నారు. వాస్తవంగా జూన్ రెండో వారంలో రుతుపవనాలు ప్రవేశించి కొద్దిపాటి వర్షాలు పడి చల్లబడాలి. ఈ సంవత్సరం ఆ పరిస్థితి కనిపించలేదు. దీంతో ఇళ్లలో వృద్ధులు, చిన్నారులు, ఆరోగ్య కేంద్రాల్లో రోగులు ఎండలకు అల్లాడిపోతున్నారు. వర్షాలు పడి వాతావరణం చల్లబడాలని కోరుతూ వరుణిడికి రైతులు, చిన్నారులు, వృద్ధులు పూజలు చేసుకుంటున్నారు.

ఘనంగా ఉమా సాంబశివుల కల్యాణం



కల్యాణోత్సవంలో వేద పండితులు, భక్తులు

కశింకోట : స్థానిక కస్పావీధిలో వెలసిన ఉమా సాంబశివుని ఆలయంలో శుక్రవారం రాత్రి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సాంబశివుడు, ఉమాదేవిల ఉత్సవ విగ్రహాలను పూలు, ఆభరణాలతో అలంకరించి శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ వేదపండితులు కొడుకుల బాలకృష్ణ ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలను ఘనంగా జరిపించారు. పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. స్వామి వారి ఆలయంలో ప్రధాన లింగరూప స్వామిని అందంగా పూలతో అలంకరించారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.